# సర్వే జనా స్సుఖినో భవంతు

అనగా అనగా ఒక రాజ్యం.

ఆ రాజ్యానికి ఒక రాజు.

ఆ రాజుగారికొక అంతఃపురం.

అంతఃపురంగారికి ఎన్నో కిటికీలు.

ఆ కిటికీలలో ఒక దానిలోంచి, —

ఒక ఆదివారంపూట, ఉదయం పది గంటలప్పుడు,

రాజుగారు చూశారు.

ఆ కిటికీ బయట విశాలంగా పరచుకుని వుంది వూరూ, ఏరూ, కొండా, కోనా ... ఆహా ! ఏమీ సుందర ప్రకృతి అనుకున్నారు రాజుగారు.

"హే విళంబీ రమ్మ్మ, రమ్మ్మ" అన్న ఉగాది గీతంలో అరచరణం ఆలపించుకున్నారు. బైనాకులర్స్ తీసి దూరాన్ని దగ్గర చేసుకున్నారు. అందాన్ని ఆనందంగా మార్చి ఆస్వాదిస్తున్నారు.

ఇంతలో —

పానకంలో పుడకలా

దూరాన ఏదో ఉప్పెనవలె కదలి వస్తున్నట్లనిపించింది.

దుమ్ము రేగి ఆకాశాన్ని అంటుతున్నట్లగుపించింది.

దీనారవాల్లాటివి వినిపించినట్లనిపించింది.

నిరీక్షణులయి, నిర్చేష్టులయి రాజుగారు మంత్రిగారిని పిలిపించారు అమాత్యశేఖరుడు వడివడిగా వచ్చాడు.

అడియేన్ దాసన్ అని నిల్చున్నాడు.

మంత్రిగారూ, అదేమిటి, ఆ దుమ్మేమిటి, ఆ నీడేమిటి, ఆ గుడగుడ చప్పుడేమిటి ? ఏమిటదేమిటి ?

ఇనకుల తిలకమా - ఇదిగో కనుక్కుంటాను సుమా - అని మంత్రి గారు హుటాహుటిని బయటికి నడిచారు.

చిన్నమంత్రిని పిలిచి విషయం యావత్తూ చెప్పారు. చిటికెలో కనుక్కోమన్నారు. చిన్నమంత్రి చిట్టిమంత్రిని కేకేశాడు. "చిట్టెబ్బాయ్... ఇది రాచకార్యం ! నిముషాలమీద రావాలి" అన్నారు.

చిట్టిమంత్రి వెంటనేవెళ్ళి పొట్టిమంత్రికి గట్టిగాచెప్పి ఇట్టేకనుక్కొచ్చి చెప్పమని హుకుమిచ్చారు.

పొట్టిమంత్రి బుజ్జిమంత్రికి, బుజ్జిమంత్రి సగంమంత్రికి, సగం మంత్రి, పావుమంత్రికి, ఆ మంత్రి అమంత్రికి- చేరవేశారు రాజుగారి జిజ్ఞాసను, ఆ జిజ్ఞాసకాస్తా దయామయుడయిన ఆ దేవుడి అనంతకోటి రూపాల్లో ఒకటి అయిన డి. ఓ. లెటర్‌గా మారింది.

పూర్వజన్మల్లో గుడ్లగూబ, తాబేలు, నత్తగుల్ల మరియు చెదపురుగు గావుండు కున్నటువంటి, ప్రస్తుతం పునాది రాయివంటి, అస్తాగుం గారికి చేరింది అ డి. ఓ. లెటరు అనబడే అర్ధాధికార పత్రం.

ఆ పత్రాన్ని అయిష్టంగా చూశాడతడు.

ఇవాళ శనివారం, వారంలో ఆఖరివారం, వెధవాఫీసులు, వెధవ పనీనూ, రేపాదివారమనగా ఇవాళ పనిచేయడ మేమిటి - అనుకుని- ఆ కాగి తాన్ని అసహ్యించుకున్నారు. ఆవలించాడు. దాంతో కత్తిపడవ చేశాడు.

మధ్యాహ్నం "లంచ్"కి వెళ్ళినప్పుడు రోడ్ ప్రక్కన కాలవలో పడేశాడు. పడవ ఝుంయ్‌మంటూ వెళ్ళిపోయింది.

ఇంకో శనివారంనాటికి ఫలానా ఫలానా నెంబరూ, ఫలానా తేదీ వగైరాకల యమ అర్జంటు కాగితం, స్వయంగా ఏలినవారికి కావలసిన సమాచారం అడిగినటువంటిది. ఏమయిందేమయిందంటూ ప్రశ్నిస్తూవచ్చింది ఒక వుత్తరం.

దాన్నిజూచి అస్తాగుం నవ్వుకున్నాడు. ఓయబ్బో, ఇట్లాటివి చాలా చూశామండోయ్ - అనుకున్నాడు. మా సంఘాలున్నంతకాలం మాకేమీ ఢోకాలేదు పొమ్మనుకున్నాడు. కాపీయింగ్ పెన్సిలూ కార్బన్ కాగితమూ తీసుకున్నాడు.

ఏమా కాగితం. ఏదో నెంబరంటున్నారు తేదీఅంటున్నారు, యమ అర్జంటు అంటున్నారు కనుక ఏదీ ఒక కాపీనిటు పారేయండి చూద్దాం అని రాసి అవతల పారవేశాడు- బఠానీలు తినసాగాడు.

రాజుగారీతోగా భారతదేశ ప్రాచీన సంస్కృతీ వికాసం గురించి అధ్యయనం చేయాలన్న అభిలాష కలవారయి "ఫారిన్‌టూర్" మొదలు పెట్టారు. వంటవాడితోసహా నలభై ఇద్దరు మాత్రమేగల ఆ బృందపు యాత్ర మూడు పువ్వులూ "ఇంటూ" రెండుకాయలు గా జోరుగా సాగుతూంది

నాలుగు రోజుల తర్వాత ఆస్తాగుం వద్దకు అసలుత్తరం వచ్చింది.

మహాభారత రచన కుపక్రమించిన నన్నయ్యను మించిన మూడ్‌లో పడ్డాడు ఆస్తాగుం. ఆ కాగితానికో 'టేగ్' తగిలించాడు. దానిమీదో నెంబరు వేశాడు. ఆ నెంబరును ఒక రిజిష్టర్లోకి ఎక్కించాడు. ఆరిజిష్టర్ని భద్రంగా అలమారాలో ఉంచి తాళంవేశాడు. ఆ కాగితాన్ని ఓ ఫైలు కవర్‌మధ్య బిగించాడు. బంగాళాకు ఔట్ హవుస్‌వలె ఆ ఫైలుకొక నోట్‌షీటు నేర్పాటు చేశాడు.

అవ్విధంబున, మట్టితో మనిషిని చేసిన - ఆ సృష్టికర్తవలె కేవలం కాగితంనుండి ఒక ఫైలును తయారుచేశాడా మూలపురుషుడు. ఆ కోమాళ్ళ పురుషుడు.

నోట్ షీటుమీద నోట్ రాశాడు ఆస్‌తాగుం.

రెండున్నర పేజీలు రాశాడు. దానినిండా బోలెడన్ని కోడ్లు, రూళ్ళు, ఉదాహరణలు అధికారాలు మొదలయిన మసాలా నింపాడు.

దాని సారాశం :

ఓ కమిటీని వేద్దాము. ఆ కమిటీవారు "అది, అనగా రాజుగారు కనుక్కోమని ఆదేశించిన అది'' ఏమిటోనని సాకల్యంగా కనుక్కొని ఇంచక్కా ఓ నివేదికను అచ్చువేసి మరీ ఇస్తారుకదా అని సూచించాడు.

పైవారు, ఆ పైవారు సై సై అన్నారు.

నోటూ, ఫైలూ కలిసి చకచక మెట్లన్నీ ఎక్కి నెల కాకుండానే పైకివెళ్ళి క్రిందకు దిగివచ్చాయి.

"సరే" అన్నారు రూల్స్‌ప్రకారం అట్లా అనడానికి అథారిటీ వున్నవారు.

కమిటీ అనగానే ఎక్కడలేని సంరంభం సమరోత్సాహం, రాజసూయాలూ అశ్వమేధాలూ ఒకేసారి చేసినంత కోలాహలం.

కమిటీలో సభ్యులుగా ఎలాంటి వారుండాలి అన్న "మీ" "మాంస బయలుదేరింది ఇది నిర్ణయించడానికి వేసిన సారథ్యం సంఘం సమావేశమయింది.

తెల్లజుత్తు వారుండాలి అని పొట్టిమంత్రి సూచించారు. సూచనకు ఒప్పుకున్నారు.

యావజ్జీవితమూ బావినీళ్ళుతప్ప ఇంకొకటి తాగనివారొక్కడు తప్పనిసరి. యని అరమంత్రిద్వారా అతడి అరభార్య చెప్పగా సరి సరి అన్నారు.

గుర్రప్పందేలలో లక్షరూపాయలయినా పోగొట్టుకున్న అనుభవజ్ఞుడొకడుంటే ఎంత దూరానవున్న వస్తువునయినా పసిగట్టి చెప్పగలడు అన్నారొకమంత్రి, ఆయనమాట విన్నారు.

కనీసం అయిదారు కమిటీలలో రాటుదేలిన 'కమిటెడ్ ఘటం' అవసరం అని 42 వ కార్యదర్శి సూచించగా సమ్మతించారు.

"అయ్యలారా, సంతకం అంటూ చేయడం తెలిసిన వాడొక్కడయినా ఈ కమిటీలో వుండక తప్పదు" అని చిట్టిమంత్రిగారు చెప్పగా విధిలేక ఒప్పుకున్నారు పెద్దలు.

కమిటీలోని ఖాళీస్థానాల గురించి పత్రికల్లో ప్రకటించారు. నానా అవస్థలూపడి ఎన్నుకున్నారు.

అదేమి చిత్రమోగాని వందలాదిమంది వచ్చారు. దేశభక్తులు వచ్చారు. కంట్రాక్టర్లు వచ్చారు. ఇంజనీర్లు వచ్చారు. డాక్టర్లు వచ్చారు. రైతులు వచ్చారు. రవుతులు వచ్చారు. కాని ఇందరిలోనూ - తెల్లటి జుత్తు వాడొక్కడంటే ఒక్కడే వున్నాడు. కూపజలంతప్ప మరొక్కటి తాగని శాస్త్రి ఏకోనారాయణో హరి; గుర్రప్పందాల అనుభవం వున్నవాడు రెండవ వాడు - అసలు లేడే కమిటీల కొలిమిలో పుటం పెట్టబడిన పుణ్య పురుషుడూ అద్వితీయుడే.

ఇకపోతే - కేవలం సంతకం మాత్రం పెట్టడం వాడి విషయంలో కొంత ఇబ్బంది కల్గింది. కాని పరమాత్ముడు చల్లగా చూడబట్టి - ఆ సరస్వతీ కటాక్షం కలవాడూ దొరికాడు.

వెంటనే, ఒక నాలుగు నెలల్లో కమిటీ ఏర్పడింది.

వారి కార్యాలయానికి ఒక యిల్లు ఇచ్చారు. ఆరు టెలిఫోన్లిచ్చారు.

దేశవాళీ కార్లిస్తే "ఇంతపెద్దవాళ్ళం మాకు ఇంపాలాకార్లు పంపాలా వద్దా" అని గద్దించారా కార్యసాధకులు.

కమిటీపని మొదలు పెట్టింది.

వారి మొదటి సమావేశంలో అసలీ కమిటీ ఏర్పడింది ఎందుకు అన్న విషయం గురించి కార్యదర్శి వివరించగా విని వారంతా ఆశ్చర్య పడ్డారు.

మీటింగయ్యాక కాఫీలు అవీ సేవిస్తూ, నేతిలో వేయించిన జీడి పప్పు లేకపోవడం గురించి రేసుగుర్రాల సభ్యుడు చేసిన విమర్శను కార్య దర్శిగారు గుర్తించారు.

కమిటీవారు హోరాహోరీ తిరిగారు. క్షణం వ్యర్థం చేయకుండా చెమటోడ్చినంత పనిచేశారు ప్రశ్నావళులు పంపారు. జవాబుల్ని సేకరించారు. వాటిని సంకలనం చేశారు. విశ్లేషించారు. ప్రజలను కలుసుకున్నారు. అసలిటువంటి కమిటీలు అమెరికాలో ఎల్లాపనిచేస్తాయో కనుక్కుందామని అమెరికాకు వెళ్ళారు. దారిలో పారిస్‌లో, రోమ్‌లోదిగి అక్కడి మంత్రుల్ని అడిగి తెలుసుకున్నారు.

చివరకు రెండో ఏడు వెళ్ళకుండానే పది సంపుటాల నివేదికను హుటాహుటిని సమర్పించేశారు.

ఓ పెద్దలారీనిండా వచ్చిన ఆ నివేదికను చూసిన మంత్రిగారు — ఆ లారీనట్లాగే వెనక్కు పంపేసి, అసలు ఈ కథాసంగ్రహం చెప్పమంటూ రాసి పంపారు.

ఆ సంగ్రహం ఆ మరువారం మంత్రిగారిది చేరింది. చేరి ఇట్లా చెప్పింది.

"అలనాడు శ్రీ శ్రీ శ్రీ రాజావారి దృష్టికి ఆనినది చరిత్ర. ఔను చరిత్ర!

చరిత్ర ఎట్లానడుస్తుంది. అది చప్పుడు చేస్తుందా వంటి చిల్లరమల్లర ప్రశ్నలు చారిత్రక దృష్టిగల శ్రీవారివంటి వారి చిత్తాలను తాకరాదు. కొందరు ఆకతాయిమూకలు, జులాయి మతాలు ఈ విషయంలో లేనిపోని పుకార్లను లేవదీశారు. అలనాడు అటు గ్రామాలనుండి ఆకలితో మాడి పోతున్న జనులు ఆర్తనాదాలూ అవీ చేసుకుంటూ వచ్చారని కల్లబొల్లి కబుర్లు చెప్పినప్పటికీ, కమిటీ వారికి అందుకు తగిన ఆధారాలేమి దొరక లేదు. పైపెచ్చు మన సైన్యాల సర్వాధికారి స్వయంగా అటువంటి వారె వరూ ఇటు చాయలకు కూడ రాలేదని శ్రీవారి పిత్రు పాదులమీద ప్రమాణం చేసి మరీ చెప్పారు. అచ్చోట పడివున్న ఒక ఎముక, అరబొమిక, కుండ పెంకు, గుడ్డపీలిక, అక్కడి చెట్లమీద నెత్తురు మరక చూసి ఉగ్రవాదులు, విద్రోహులు ఏవో పిచ్చికూతలు కూస్తే కూయుదురు గాక కాని అసలు నిజం మాత్రం వేరు.

"ఆ ప్రాంతంలో అతిధిగృహం కట్టడానికని పునాదులు త్రవ్వు తుండగా బయటపడిన అవశేషాలే ఇవి, అని మా గట్టినమ్మకం సరిగ్గా ఇదేచోట క్రీ. పూ. 893 లో కాలకూట వంశపు రాజు, మేరువర్మ రాజ ధాని వుండేదనిన్నీ, అతడి పైకి దండెత్తిన నాల్గవ మెలికేశిని సరిగ్గా ఇక్కడే జరిగిన మహాయుద్ధకలో చెవులు మెలివేసి చిత్తుగా ఓడించాడనిన్ని చెప్పడానికి బ్లంకెట్, మియర్సన్, తెరియోపిల చారిత్రక గ్రంథాలే సాక్ష్యాలు, ఇట్లాంటి చరిత్రాత్మతమైన ప్రదేశం మన కోటగుమ్మం వాకిట వెలువడం మన రాజుగారి పూర్వజన్మ సుకృతఫలం, మనరాజ్యం యొక్క భాగ్యం కనుక ఆ చోటిని చారిత్రాత్మక ప్రదేశంగా ప్రకటించి, దాని రక్షణకు తగు చర్యలు తీసుకోవలసిందిగా మేము ముక్తకంఠంతో మనవి చేస్తున్నాము.

మనవి ఆలకించారు రాజుగారు.

భళా భళా అన్నారు మంత్రులు.

ఆస్తాగుంల జీతాలు పెంచారు.

కమిటీ వారియొక్క అనన్య సామాన్యమైన కృషికీ, రాజ్య సంస్కృతీ పునరుద్ధరణకై వారుచేసిన అమోఘమైన సేవకూ మెచ్చి రాజు గారు కమిటీ సభ్యులందరికీ "చారిత్రక కేసరి" బిరుదాలను ప్రసాదించారు. చాకేసరులందరూ మహా ప్రసాదమన్నారు.

ఆ శుభ సందర్భాన మాగధి శాస్త్రిగారు "మిమ్ము నుతియింపవలె నన్నఓ రాజ. ఆంధ్రభోజ, కావలెనొక కొంగ్రొత్తబాస" — అంటూ 108 పద్యాలు చదివారు. చదివి నాయనకు శాలువా కప్పారు. చప్పట్లుకొట్టారు ప్రేక్షకులు.

ఈవిధంగా ఆ రాజ్యం -

అటువంటి అపూర్వమయిన రాజుతో,

సంతృప్తి చెందిన మంత్రులతో,

ఆస్తాగుంలతో,

చాకేసరులతో

శాలువాలవారితో

తులతూగుతూ,

పాలసముద్రం మీద మీగడలాగున

బాలమురళీపాడిన బేగడ లాగున

వెలుగొందుతూంది సారీ.

వెలుగొందుచున్నయది.

★